క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా పానుగోటి హరీష్



హరీష్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన పానుగోటి హరీష్ బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి హరీష్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కంకణాల నివేదిత శ్రీధర్‌రెడ్డి, మండల కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినీల్‌కుమార్‌కు సన్మానం

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామానికి చెందిన పొట్టిపాక వినీల్‌కుమార్ గత నెలలో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ మేరకు శుక్రవారం డీవైజేఏసీ చైర్మన్ కిషన్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానికంగా వినీల్‌కుమార్‌ను సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 5నుంచి 9తరగతుల్లో, కళాశాలలోని ఎంఈసీ, సీఈసీ గ్రూప్స్‌లో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 17న ఉదయం 11గంటలకు పాఠశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

డిండి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపాలి

డిండి : మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టును కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తిస్థాయిలో నింపాలని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనొద్దిన్ శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్‌లో డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేసిన వరిపంట చేతికొచ్చే సరికి దాదాపు 3నెలలు పడుతుందని, ప్రాజెక్టులో కేవలం 20రోజులకు సరిపడా నీరు మాత్రమే ఉందన్నారు. ఈ విషయంపై జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై నేడు ఓపెన్ ఫోరం

కొండమల్లేపల్లి : మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6నుంచి 16వతేదీ వరకు మండలంలో పనులకు సంబంధించి తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ



వాటర్‌ఫిల్టర్ బహూకరిస్తున్న ప్రతినిధులు

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఎన్‌హెచ్ఆర్‌సీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గౌస్‌పాషా వాటర్‌ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా గౌస్‌పాషా మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తడకమళ్ల భిక్షమయ్య, బండి నరేష్, పెద్దిశెట్టి సత్యనారాయణ, ఎండీ.ఆరీఫ్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అడవిదేవులపల్లి : మండల కేంద్రం సమీపంలో కృష్ణానది ఒడ్డున ఉన్న బౌద్ధమ దేవాలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు యడవల్లి అనంతకృష్ణశర్మ, రఘురామయ్య శర్మల వేదమంత్రోత్సవాల మధ్య చేపట్టిన కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

- డీలర్ల నుంచే సేకరిస్తున్న వ్యాపారులు
- యథేచ్ఛగా సాగుతున్న రవాణా
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



చింతపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

చింతపల్లి : నల్లగొండ – నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దుల్లో రేషన్ (పీడీఎస్) బియ్యం దందా జోరుగా సాగుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమార్కులు దేవరకొండ నియోజకవర్గ పరిసర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పేదలు ప్రభుత్వం రాయితీపై ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. పోలీసులు అడపాదడపా తనిఖీలు చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో 30క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుబడింది. నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ, చింతపల్లి, డిండి, చందంపేట మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాకు సరిహద్దున ఉండడంతో ఇక్కడ రేషన్ బియ్యాన్ని సేకరించి దళారులు కల్వకుర్తి, చారగొండ మండల కేంద్రాల్లోని రైస్‌మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. డీలర్ల నుంచి సేకరించి గతంలో లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో రాయితీపై కొనుగోలు చేసిన బియ్యాన్ని దళారులకు విక్రయించేవారు. అధికారుల నిఘా పెరగడంతో ఇది చాలా వరకు తగ్గింది. ఇదే అదునుగా భావించిన కొంత మంది రేషన్‌డీలర్లు బియ్యం పంపిణీ చేసేటప్పుడు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని కిలోకు రూ.8వరకు చెల్లిస్తున్నారు. డీలర్ల నుంచి దళారులు రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మారుమూల ప్రాంతాలు, మండల సరిహద్దు ప్రాంతాల్లో లారీ, డీసీఎం, టాటా ఏస్ వాహనాల్లో లోడ్ చేసి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి అక్రమంగా రవాణా చేస్తున్నారు. దళారులు ఈ విధంగా సేకరించిన రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.13నుంచి రూ.16వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులకు నాయకుల అండదండలు ఉండడంతో ప్రతి నెలా అక్రమ రవాణా సాగిస్తున్నట్లు సమాచారం.

మన బియ్యం మనకే..

రేషన్ దుకాణాల్లో, గ్రామాల్లో దళారుల సేకరించిన రేషన్ బియ్యాన్ని కల్వకుర్తిలోని ఓ ప్రాంతంలో రీసైక్లింగ్ చేసి కర్నూల్ బియ్యం పేరుతో బ్యాగుల్లో ప్యాక్ చేసి తిరిగి నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లోని కిరాణ దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

మండల సరిహద్దు ప్రాంతాల్లో రేషన్ బియ్యం నిలవ్రలు ఉన్నట్లు ప్రజలు సమాచారం అందిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో వంద టన్నులకు పైగా పీడీఎస్ బియ్యం పట్టుబడడంతో దేవరకొండ నియోజకవర్గంలో ఈ దందా జోరుగా సాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేషన్‌బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. రైతులను రుణ విముక్తులను చేశామని, రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీష్‌రావు వెంటనే రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్ పనులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి సాగు, తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని వంద పడకల నుంచి రెండు వందల పడకల స్థాయికి పెంచేందుకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని చందంపేట, డిండి, నేరేడుగొమ్ము మండలాల పరిధిలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ తదితర పనులకు గాను రూ.14కోట్ల 50లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, నల్లగాసు జాన్‌యాదవ్, ముత్యాల సర్వయ్య, మారుపాకల సురేష్‌గౌడ్, తేర సత్యనారాయణరెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, యూనూస్, ముక్కమళ్ల వెంకటయ్య, వడ్త్య దేవేందర్, శిరందాసు కృష్ణయ్య, గోవిందు, తదితరులున్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన ప్రతిఒక్కరూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 142మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆపద సమయాల్లో సీఎం సహాయనిధి ఆపన్నహస్తం లాంటిదన్నారు.

ప్రజా సంఘాల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : కల్‌కత్తాలో ఓ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యచేసినందుకు నిరసనగా శుక్రవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్‌కే రక్షణ లేకుండా పోయిందన్నారు. నిందితులకు కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళ డాక్టర్లకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బి.రామయ్య, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు అంబటి నాగయ్య, డాక్టర్ జాడీరాజు, మౌజం హుస్సేన్, ఖాదర్, బాలస్వామి. డి.గణేష్, గోపి, కిర్మణయి, మాలోతు దశరథ నాయక్, కొండల్‌రెడ్డి, పాదూరి రమణారెడ్డి, హఫీజ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నేడు ఓపీ సేవలు బంద్

మిర్యాలగూడ అర్బన్ : కలకత్తాలో ఈనెల 2న ఓ మహిళా డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనకు నిరసనగా నేడు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్షురాలు ముువ్వా జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా వైద్యురాలిపై దాడి జరిగినట్లు కాదని మొత్తం స్త్రీ సమాజంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. మానవత్వంపై జరిగిన దాడికి నిరసనగా మృతురాలికి సంఘీభావంగా ఆస్పత్రులలో ఓపీ సేవలు నిలిపివేసి డాక్టర్లు, వైద్య సిబ్బంది, మానవతావాదులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఈ ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

దేవరకొండ : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేస్తూ దేవాలయాలను ధ్వంసం చేస్తున్న ఘటనలో ఐక్యరాజ్యసమితి స్పందించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ సహ ప్రాంత భజరంగ్ దళ్ ప్రముక్ కన్నెబోయిన వెంకట్ డిమాండ్ చేశారు. హిందువులపై దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పగిళ్ల సాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన దేవరకొండ పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. హిందువులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం తక్షణమే బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గుంటోజు రామకృష్ణ, తాడిశెట్టి సుదర్శన్, దాసపత్రి రాము, కర్నాటి సురేష్, నర్సింహ, చెనమోని రాములు, అంజయ్య, జల్దా భాస్కర్, నీలా బుచ్చయ్య, వనం శ్రీను, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



హాలియాలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



మిర్యాలగూడ : రైల్వేకాలనీ సాయిదత్తా ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



మిర్యాలగూడ : హౌజింగ్‌బోర్డులో వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

మిర్యాలగూడ టౌన్ : శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వత్రాలు నిర్వహించారు. పట్టణంలో ప్రధానంగా రెడ్డికాలనీలోని శ్రీకోదండరామాలయం, ఈదులగూడెంలో శ్రీసీతారామస్వామి దేవాలయం, ముత్తిరెడ్డికుంటలోని సంతోషిమాత ఆలయం, హౌజింగ్‌బోర్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు, వ్రతా లను చేశారు. ఈదులగూడెంలోని శ్రీసీతారామస్వామి దేవాలయంలో జరిగిన వరలక్ష్మి వ్రతాలను ప్రధాన అర్చకుడు వినయ్ వేదమంత్రోత్సవాలతో నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండి యాదగిరిరెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, చల్లా నాగమ్మవెంకన్న, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సాయిద్రత్తాశ్రమంలోని శ్రీఅష్టలక్ష్మి మందిరంలో సామూహిక వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమన్న, పందిరి సత్యనారాయణ, జగన్నాథరావు, జానకిరాముడు, రవికిరణ్, విక్రమ్, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, చంద్రకళ, కళ్యాణి, భవానీ, శారద ఉన్నారు.

హాలియా : పట్టణంతో పాటు అనుముల మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీలోని షిర్డీ సాయిమందిరం, సీతారామ స్వామి ఆలయం, స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మి సహస్రనామ, కుంకుమార్చన పూజలు జరిపించారు. అనంతరం మహిళలు వరలక్ష్మి వత్రాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా నిడమనూరు మండలంలో కూడా వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

చింతపల్లి : గ్రామాల్లో త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలకు సీపీఐ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతుభవన్‌లో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వార్డు మెంబర్ల నుంచి జెడ్పీటీసీ స్థాయి వరకు అన్ని స్థానాలలో పోటీ చేసేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి కమ్యూనిస్టులు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. బూర్జువా, పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు తాగుసాగునీరు అందించాలని కోరారు. తదనంతరం 9మంది మండల పార్టీ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, పల్లపు లక్ష్మయ్య, మల్లోజు శేఖరాచారి, శంషుద్దీన్, నరసింహ, వీరయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, భారతమ్మ, యాదయ్య, జితేందర్, రామకృష్ణ, సైదులు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

26న ఇంటర్‌స్కూల్ క్రికెట్ టోర్నమెంట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు

మిర్యాలగూడ : పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల క్లియోస్పోర్ట్స్ ఇంటర్‌స్కూల్‌లో ఈనెల 26నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్లియోస్పోర్ట్స్ యాజమాన్యం శుక్రవారం తెలిపింది. ఈ టోర్నమెంట్‌ను హార్డ్ టెన్నిస్‌బాల్‌తో నిర్వహిస్తామని ఈనెల 25సాయంత్రం 4గంటలలోపు స్కూల్ టీంలను 88969 21234కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ట్రస్మా అధ్యక్షుడు కె.శ్యాంసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అదేవిధంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారు పట్టణంలోని హౌజింగ్‌బోర్డులోని క్లియోస్పోర్ట్స్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-16 సెలక్షన్స్‌లో క్లియోస్పోర్ట్స్ క్రీడాకారులు ఎంపికైనట్లు తెలిపారు. ఎండీ.అఫాన్, జి.మణికంఠ, ఎ.జయంత్‌లు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎంపికైనట్లు, హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి హెచ్‌సీపీ సెలక్షన్స్‌లో, హెచ్‌సీపీ ఇంటర్‌స్కూల్స్, కాలేజెస్ వన్‌డే లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ కోచ్ రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో క్లియోస్పోర్ట్స్ యాజమాన్యం, స్పార్కిల్ స్కూల్ హెజాజ్ హుస్మి, ఎస్‌వీ ఇన్ఫోటెక్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

హాలియా : విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కీసర యుగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో అనుముల, తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండలాల్లో 2023-24విద్యా సంవత్సరం పదోతరగతి వార్షిక ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ శ్రేణుల్లో ఉత్తీర్ణులైన 42మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000చొప్పున రూ.42వేల ఉపకార వేతనాన్ని అందజేశారు. కార్యక్రమంలో హాలియా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాంపాటి పాండరయ్య, అనుముల మండలశాఖ కార్యవర్గ సభ్యులు వి.పుల్లారెడ్డి, కార్యదర్శి రామలింగయ్య, ట్రెజరర్ వెంకటేశం, అసోసియేట్ అధ్యక్షుడు హనిమిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎం రాములు, నారాయణరెడ్డి, షాబోద్దీన్, ఖరీం, రాంమూర్తి, సుధాకర్ రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, జమీర్ ఉన్నారు.

బుద్ధవనంలో హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ బుద్ధవనంలో ఏర్పాటు చేసిన సిద్ధార్థ హోటల్‌ను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. నాలుగేళ్లుగా ఈ హోటల్ మూతబడి ఉండడంతో గత ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా బాధ్యతలు తీసుకున్న ప్రకాశ్ రెడ్డి ఇటీవల నాగార్జునసాగర్‌కు వచ్చారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పరిస్థితులను పరిశీలించి హోటల్‌ను అభివృద్ధి చేసుకోని నడిపే విధంగా అగ్రిమెంట్ తీసుకోని ఈ నామినల్ రెంట్‌కు ఇచ్చారు. దీంతో హోటల్‌కు మరమ్మతులు చేసుకోని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాజాప్రసాద్, కౌన్సిలర్ రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

చింతపల్లి : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూర్యాపేట డీఐఓ భానునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆలుకా జయేందర్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఆయనను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. అదే విధంగా లెక్చరర్ పద్మ, రికార్డు అసిస్టెంట్ సైదులుకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన్‌రాజు, రామస్వామి, వాసు, లింగస్వామి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



భానునాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు

మిర్యాలగూడ : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పలువురు పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామపంచాయతీలకు నిధులు లేక తాము అప్పులు తీసుకొచ్చి గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తున్నామని, ఉన్నతాధికారులు తమపై తీవ్రఒత్తిడి తీసుకొస్తూ పనిభారాన్ని పెంచుతూ మానసిక ఆవేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐలాపురం పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మాధవ్‌రెడ్డి, భవానీ, యాదగిరి, రవీందర్, మహేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రజలకు సంస్థ కల్పిస్తున్న రాఖీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం రాంమోహన్‌రెడ్డి, కార్గో మిర్యాలగూడ డిపో కోఆర్డినేటర్ పరంగి నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో కార్గో ద్వారా రాఖీలను మీ సోదరులకు 24గంటల్లో చేరే విధంగా అవకాశం కల్పించిందని, నామమాత్రపు చార్జీలతో రాఖీలను చేరవేయనున్నట్లు తెలిపారు.

గాజీనగర్‌లో ఫీవర్ సర్వే

కొండమల్లేపల్లి : మండలంలోని గాజీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సర్వేలో సుగుణ, హెల్త్ సూపర్‌వైజర్ కె.రాణి, సృజన, ఆశావర్కర్లు, ఇందిరా, జ్యోతి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలో ఇంటింటి సర్వే ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీఓ కరుణాకర్ రావు, డాక్టర్ అజార్, రామాంజనేయులు కోరారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఇంటింటి ఫీవర్ సర్వే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ సూరానాయక్, ఏఎన్‌ఎంలు తదితరులున్నారు.

మలిదశ ఉద్యమనేతకు దక్కిన గౌరవం

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఎంపిక చేసినందుకు ఉద్యమకారులకు మంచి గౌరవం దక్కిందని తెలంగాణ జేఏసీ నాయకులు మాలోతు దశరథనాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట సంఘం నాయకులు మారం శ్రీనివాస్, శ్రీనివాస్, అంజయ్య, జయరాజు, సైదులు, సురేందర్‌రెడ్డి, మక్లానాయక్ తదితరులున్నారు.

మండల విద్యాధికారిగా తరి రాము

పెద్దవూర : మండల విద్యాశాఖ అధికారిగా తరి రాములు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేస్తున్న లావూరి బాలునాయక్ యాద్గార్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎంగా బదిలీపై వెళ్లడంతో పాటు అనుముల, నిడమనూరు ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతం నుంచి విధులు నిర్వర్తించడం ఇబ్బందిగా మారడంతో డీఈఓకు ఆదేశాల మేరకు గుర్రంపూడు, పీఏపల్లి, తిరుమలగిరిసాగర్ ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం తరి రాములుకు బాధ్యతలు అప్పగించారు.

గ్రామదేవతలకు జలాభిషేకం

చింతపల్లి : వర్షాలు సమృద్ధిగా కురిసి బాగా పంటలు పండాలని మండలంలోని వింజమూరు గ్రామస్తులు శుక్రవారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు లేకపోవడంతో తీవ్ర నీటికొరత ఏర్పడి పంటలు చేతికందే పరిస్థితి లేకుండా పోయిందని, భూగర్భజలాలు అడుగంటడంతో వరినాట్లు వేసుకున్న రైతులకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. దీంతో గ్రామాలలో తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకాలు చేస్తూ వరుణ దేవుణ్ణి వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దండేటికార్ ప్రసాద్, కర్నాటి శ్రీను, యాచారం పెద్దమల్లయ్య, రంగయ్య, రాధాకృష్ణ, లక్ష్మయ్య, చిన్నమల్లయ్య, వెంకటయ్య, యాదయ్య ఉన్నారు.

నేటి నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని నేటి నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌యూసుఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కోసం 14వేల 313మంది దరఖాస్తులు చేసుకోగా వాటిలో 4వేల 400 దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుందన్నారు. వాటిలో 1722 దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి ఆమోదం తెలిపినట్లు, అయితే వారు మున్సిపాలిటీకి చెల్లించే రుసుముతో నిర్మాణాలను చేపట్టుకోవచ్చన్నారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్నవి పెండింగ్‌లో ఉండొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేపట్టిందన్నారు. అందులో భాగంగానే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు నీటిపారుదల శాఖ ఏఈలు, టౌన్ ప్లానింగ్ అధికారులు కలిసి దరఖాస్తు చేసుకున్న వారి స్థలాన్ని పరిశీలించి నివేదికను అందిస్తారన్నారు. సమావేశంలో టీపీఎస్ అంజయ్య తదితరులున్నారు.